సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 11 । జనవరి । 2023



బద్దిపోచమ్మ గుడికి మరమ్మతులు

వేములవాడ: బద్దిపోచమ్మ గుడికి మరమ్మతులు చేస్తున్నారు. గృహాలను తొలగించిన ఉత్తరదిశ వైపు గుడికి మరమ్మతులు చేపట్టారు.



రాజన్న సన్నిధి.. సంగీత విభావరి

వేములవాడ: త్యాగరాజ ఆరాధనోత్సవాలకు రాజన్న ఆలయంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి ఐదు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. -10లో..

గరిష్ఠం/కనిష్ఠం
30.0/12.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. చలి తీవ్రంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మంత్రి కేటీఆర్‌ను కలిసిన డీఐజీ రమేశ్‌నాయుడు



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఐజీ కె.రమేశ్‌నాయుడు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జోన్‌కు నూతన డీఐజీగా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన కె.రమేశ్‌నాయుడు మంగళవారం మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తంగళ్లపల్లి మండల పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్‌ను మండల ప్రజాపరిషత్ నూతన భవంతి వద్ద కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఎస్పీ రాహుల్‌హెగ్డే ఉన్నారు.

కంటివెలుగు విజయవంతం చేయాలి



అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాధవి, కమిషనర్ అన్వేశ్

వేములవాడ: ప్రభుత్వం ఈనెల 18న చేపట్టే రెండోవిడత కంటి వెలుగును విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్ కోరారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. ప్రజాప్రతినిధులు, ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు, సీఎల్‌ఆర్పీలు వార్డులలో ప్రజలకు పరీక్షలు నిర్వహించేలా చూడాలన్నారు. సమస్య ఉన్న వారికి వైద్యుల పర్యవేక్షణలో రీడింగ్‌గ్లాసులు అందిస్తారని తెలిపారు.

ప్రతీ మండలంలో పాదయాత్ర



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

వేములవాడ: హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను ఈనెల 26న ప్రతీ మండలంలో ప్రారంభించాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడలోని తన నివాసంలో వేములవాడ పట్టణ, అర్బన్, రూరల్ మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో మంగళవారం సమావేశమయ్యారు. రాహుల్‌గాంధీ చేపట్టిన ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా అన్ని గ్రామాలకు కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. సాగారం వెంకటస్వామి, పిల్లి కనకయ్య, వకుళాభరణం శ్రీనివాస్ ఉన్నారు.

ఇన్‌స్పైర్‌మానక్‌కు ఎంపిక

గంభీరావుపేట(సిరిసిల్ల): కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఇన్‌స్పైర్ మానక్ 2022–23 అవార్డు ప్రయోగ ప్రదర్శనకు గంభీరావుపేటలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం గంగారాం తెలిపారు. పాఠశాలకు చెందిన సాగర్, అఖిల, ధనుంజయ్, రాహుల్ ఎంపికైనట్లు చెప్పారు.

శ్రమించాలి..సాధించాలి



మాట్లాడుతున్న డీఐఈవో మోహన్

సిరిసిల్లకల్చరల్: కచ్చితమైన లక్ష్యాన్ని నిర్ణయించుకుని పట్టుదలతో శ్రమించి విజయాలను సాధించాలను జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి సీహెచ్.మోహన్ కోరారు. సెస్ బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పోటీపరీక్షల్లో విజయం సాధించడం అనే అంశంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఇంటర్మీడియెట్‌తోపాటు ఆసక్తిగల విద్యార్థులకు ఎంసెట్, నీట్ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అగ్రహారం డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేశ్, సీనియర్ ఫిజిక్స్ లెక్చరర్ హనుమంతరావు, కళాశాల ప్రిన్సిపాల్ వనజాకుమారి, అధ్యాపకులు సీతారామ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

‘సెస్’ ఎన్నికలు ట్రైలరే..

- బీజేపోళ్లకు సినిమా చూపిస్తం
- 15 స్థానాలు గెలువడం సంతోషంగా ఉంది
- ప్రత్యేక విద్యుత్ ప్రణాళిక ఇస్తే ఎన్ని కోట్లయినా ఇస్తాం
- ‘సెస్’లో అవినీతి రహిత పాలన అందించాలి
- సిరిసిల్లలో రాష్ట్ర మంత్రి కె.తారకరామారావు
- ‘సెస్’ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, చిత్రంలో మంత్రి కేటీఆర్, వినోద్‌కుమార్, రసమయి బాలకిషన్, రవీందర్‌రావు, రవిశంకర్, ఎల్.రమణ

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులందరూ విజయం సాధించి 33 జిల్లాలకు స్ఫూర్తినిచ్చారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరా మారావు పేర్కొన్నారు. సిరిసిల్లలోని పద్మనాయక కల్యాణ మండపంలో మంగళవారం ‘సెస్’ వినియోగదారులకు కృతజ్ఞత సభను నిర్వహించారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ‘సెస్’కు పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమిస్తే.. బీజేపోళ్లు కోర్టుకెళ్లి ఎన్నికలు తెచ్చారన్నారు. 15 సీట్లలో బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులు గెలిస్తే వారి నుంచి సమాధానం లేదన్నారు. బీజేపోళ్లకు ఇది ట్రైలర్ మాత్రమేనని.. 2023లోనే సినిమా చూపిస్తామన్నారు. బీజేపీ ‘సెస్’ ఎన్నికల్లో ఎన్ని డబ్బులు పంచినా.. రైతులు మా వైపే ఉన్నారన్నారు. రుద్రంగిలో ఓటుకు రూ.3వేలు పంచుతున్నారని చాలా మంది తనకు ఫోన్లు చేశారని కేటీఆర్ వివరించారు. ప్రత్యేక విద్యుత్ ప్రణాళిక రూపొందిస్తే, ఎన్ని కోట్లయినా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అవినీతి రహితంగా సేవలందించాలని కోరారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్ జిల్లాకు ఏమైనా చేశాడా.. అని మంత్రి ప్రశ్నించారు. మా ప్రభుత్వం చేసిన పనులు కళ్లముందే ఉన్నాయని, ఇంజినీరింగ్ కాలేజీ, మెడికల్ కాలేజీ, జిల్లెల్ల వద్ద వ్యవసాయ కాలేజీ, వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఇంకా అనేక పనులు చేశామని కేటీఆర్ వివరించారు. దేవుడు.. దేవుడు అని చెప్పే సంజయ్ వేములవాడ రాజన్న గుడికైనా నిధులు తెచ్చారా.. అని నిలదీశారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, టెస్కాబ్ చైర్మన్ కె.రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడారు. ‘సెస్’ చిక్కాల రామారావును సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి దంపతులు సన్మానించారు.

నేతన్న బీమా చెక్కుల పంపిణీ

సిరిసిల్లలో ఇటీవల మరణించిన నేతకార్మికులు నల్ల సూర్యనారాయణ, కోడం శ్రీశైలం కుటుంబాలకు మంజూరైన నేతన్నబీమా చెక్కులు రూ.5 లక్షల చొప్పున మంత్రి కేటీఆర్ అందజేశారు. రాష్ట్ర పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జౌళిశాఖ ఏడీ సాగర్ ఉన్నారు.

‘సెస్’ చైర్మన్ ప్రమాణ స్వీకారం

సిరిసిల్ల ‘సెస్’ ఆఫీస్‌లో చైర్మన్‌గా చిక్కాల రామారావు, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి తల్లి ఇటీవల మరణించడంతో ప్రమాణ స్వీకార వేడుకల్లో పాల్గొనలేదు. ‘సెస్’ చైర్మన్‌గా చిక్కాల రామారావును సీట్లో కూర్చోబెట్టి మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, బీఆర్‌ఎస్ జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, డీసీవో బుద్ధనాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళాచక్రపాణి, రామతీర్థం మాధవి, ‘సెస్’ఎండీ రామకృష్ణ పాల్గొన్నారు. ‘సెస్’ డైరెక్టర్లను, అధికారులను మంత్రి కేటీఆర్ శాలువా, మెమొంటోలతో సత్కరించారు.

మంత్రిగా రాలేదు.. మనవడిగా వచ్చా..



కొదురుపాకలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

బోయినపల్లి(చొప్పదండి): కొదురుపాక గ్రామానికి మంత్రిగా రాలేదు.. మనవడిగా వచ్చా.. ఎండాకాలం సెలవుల్లో సర్వీస్ బస్సులో వచ్చి రిక్షాలో సుభాష్ కాడ దిగి తాతయ్య ఇంటికెళ్లేవాన్ని అని మంత్రి కేటీఆర్ గుర్తుచేసుకున్నారు. బోయినపల్లి మండలంలోని కొదురుపాకలో కేటీఆర్ అమ్మమ్మ–తాతయ్యలు జోగినిపల్లి లక్ష్మీబాయి–కేశవరావు స్మారకార్థం రూ.2కోట్లతో నిర్మించే ప్రైమరీ స్కూల్ భవనం పనులకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన బహిరంగసభలో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. జిల్లాకో మెడికల్ కలాశాల ఏర్పాటుతో బడుగు, బలహీనవర్గాల పిల్లలకు వైద్యవిద్య అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తనకు మెడిసిన్‌లో 1600 ర్యాంక్ వచ్చినా సీటు రాలేదని.. ఇప్పుడా పరిస్థితులు లేవన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్వాసితులకు ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. నిర్వాసితుల ఉపాధి కోసం పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని కోరారు. కులసంఘం భవనాలకు రూ.30 కోట్లు కేటాయించాలని విన్నవించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, సెస్ డైరెక్టర్ కొట్టిపల్లి సుధాకర్, వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ఉన్నారు.

బాపూజీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నాం



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు, ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. తంగళ్లపల్లిలో ని పద్మశాలీ సంఘం భవనం ఎదుట కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, పద్మశాలీ నాయకులు పా ల్గొన్నారు. అనంతరం తంగళ్లపల్లి మండల ప్రజాపరిషత్ భవనాన్ని ప్రారంభించారు. ఎంపీపీ మానసను చైర్‌లో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలి పారు. వైస్‌ఎంపీపీ జంగిటి అంజయ్య, జెడ్పీ సీఈవో బి.గౌతమ్ రెడ్డి, ఎంపీడీవో లచ్చాలు, తహసీల్దార్ సదానందం పాల్గొన్నారు.

పోర్టు పోలియో జడ్జిల నియామకం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు జిల్లాలకు పోర్టుపోలియో జడ్జిలను హైకోర్టు మంగళవారం నియమించింది. కరీంనగర్‌కు జస్టిస్ కన్నెగంటి లలిత, పెద్దపల్లి జిల్లాకు జస్టిస్ ఎన్‌వి శ్రవణ్‌కుమార్, జగిత్యాల జిల్లాకు జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి, సిరిసిల్ల జిల్లాకు జస్టిస్ డి.నాగార్జునను నియమించారు.

నిజాయితీగా గెలిస్తే.. అరెస్టులు ఎందుకు ?

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

సిరిసిల్ల: సెస్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులు నిజాయితీగా గెలిస్తే.. కాంగ్రెస్ నాయకులను ఎందుకు అరెస్టు చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ఈమేరకు మంగళవారం రాత్రి ట్విట్టర్ వేదికగా మంత్రి కేటీఆర్‌కు పలు ప్రశ్నలు సంధించారు. ‘సెస్’ఎన్నికల్లో మీరు ప్రజలను ఎంత మభ్యపెట్టారో, ఎంత డబ్బు పంచారో ప్రజలకు బాగా తెలుసునని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రూ.5కోట్లు పంచారని మంత్రి కేటీఆర్ చెబుతున్నారని, ఆయన డబ్బులు పంచుతుంటే పట్టుకోకుండా ఎందుకు వదిలేశారని నిలదీశారు. మీ చీకటి ఒప్పందం ఏమిటో బయటపెట్టాలని కోరారు. బీజేపీ ఓటుకు రూ.3వేలు పంచితే.. మీరు ఎంత పంచి ఉంటారో అర్థమవుతుందన్నారు. కొదురుపాకకు వస్తే అమ్మమ్మ గుర్తుకొస్తుందన్న కేటీఆర్ 2018లో వేములవాడ రాజన్న సాక్షిగా ముంపు బాధితులకు ఇచ్చిన హామీ గుర్తుకు రావడం లేదా? అని ప్రశ్నించారు.

బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గాల ప్రభారీ, కన్వీనర్ల నియామకం

కరీంనగర్ టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాలకు ప్రభారీలు, కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ ప్రభాస్ యోజన కన్వీనర్ జి.ప్రేమేందర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం ప్రభారీగా మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రభారీగా అట్లపురం విష్ణువర్ధన్ రెడ్డిని నియమించారు. కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్‌గా బోయినపల్లి ప్రవీణ్‌రావు, జాయింట్ కన్వీనర్లుగా ఎం.దశరథరెడ్డి, ఆడేపు రవీందర్, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్‌గా పుదిల మల్లికార్జున్, జాయింట్ కన్వీనర్‌గా ఎస్.వెంకటేశ్‌గౌడ్‌ను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొత్త లక్ష్యాలతో పాఠశాలల అభివృద్ధి

- మండల విద్యాధికారి రఘుపతి
- వెంకటాపూర్‌లో పాఠశాల తనిఖీ
- పీఎం శ్రీయోజన పథకానికి 15 పాఠశాలల ఎంపిక



పాఠశాలను తనిఖీ చేస్తున్న రఘుపతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పీఎం శ్రీయోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి నూతన విద్యావిధానం పాలసీతో సర్కారు బడులను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నారని మండల విద్యాధికారి దూస రఘుపతి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో ఈ పథకానికి మొదటి విడతలో 15 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆ పాఠశాలల్లో ఉన్న వసతులు, కావాల్సిన సదుపాయాలపై పరిశీలన చేస్తున్నామని అందులో భాగంగానే వెంకటాపూర్ పాఠశాలను పరిశీలించామన్నారు. ఆన్‌లైన్ ద్వారా పాఠశాలల వారీగా వచ్చిన స్కోర్ ఆధారంగా ఎంపిక చేశామన్నారు. పథకానికి కావాల్సిన అన్ని వసతులు ఉన్నాయా..లేదా అని తెలుసుకోవడానికి ముందుగా ఎంపికైన పాఠశాలల్లో పరిశీలిస్తున్నామన్నారు. హెచ్‌ఎం శేఖర్ పాల్గొన్నారు.

సైజింగ్ కార్మికుల కూలి పెంచాలి

సిరిసిల్లటౌన్: పద్దెనిమిది రోజులుగా సమ్మె చేస్తున్న సైజింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో మంగళవారం నిర్వహించిన వేర్వేరు ప్రెస్‌మీట్‌లలో మాట్లాడారు. కార్మికుల డిమాండ్‌లు కూలీపెంపుపై కలెక్టర్, మంత్రి కేటీఆర్ స్పందించాలని కోరారు. బతుకమ్మ చీరల ఉత్పత్తిలో ఆసాములకు రావాల్సిన డాబీ పింజర సబ్సిడీ అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలన్నారు. కోడం రమణ, సిరిసిల్ల రవి, వెల్దండి రాజేశం, గాజుల శంకర్ పాల్గొన్నారు.

రామాలయంలో అధ్యయనోత్సవాలు



అధ్యయనోత్సవాల్లో వేద పండితులు

గంభీరావుపేట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గంభీరావుపేట మండలకేంద్రంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో అధ్యయనోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అధ్యయనోత్సవాల్లో భాగంగా ప్రభంధ సేవా కాలం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.

కేంద్రమే కల్లాలు నిర్మించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



మాట్లాడుతున్న వేణు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఉపాధిహామీ పథకంలో కేంద్ర ప్రభుత్వమే రైతులకు కల్లాలు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధిహామీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబోసుకోవడానికి నిధులు కేటాయిస్తూ, కల్లాలను ఏర్పాటు చేసిందన్నారు. రూ.157 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా కల్లాలను ఏర్పాటు చేసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీకి నిధులు మంజూరు చేయకపోవడంతో, కల్లాలు ఏర్పాటు చేసుకునే పరిస్థితి లేదన్నారు. కల్లాలు పూర్తికాకపోవడంతో రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మంత్రి చంద్రన్న, సీపీఐ మండల నాయకులు ఆలివేని భూదన్న, మిద్దె నర్సయ్య, బీరయ్య, శంకర్, ఆనంద్, రాములు, మల్లయ్య, పోషయ్య ఉన్నారు.

బేబీ ఫీడింగ్ క్యాబిన్

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే పిల్లతల్లులకు ఆలయ ఆవరణలో బేబీ ఫీడింగ్ క్యాబిన్‌ను సిద్ధం చేస్తున్నారు. తమ పిల్లలకు పాలు ఇచ్చేందుకు క్యాబిన్‌కు మంగళవారం తుది మెరుగులు దిద్దుతున్నారు. రాజన్న దర్శనానికి వచ్చే తల్లులకు ఈ క్యాబిన్ ఉపయోగపడనుంది.



సాంకేతిక లోపం.. అందని రేషన్

- జిల్లాలో నిలిచిన రేషన్ పంపిణీ
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- 345 దుకాణాలు.. 1.74లక్షల రేషన్‌కార్డులు
- నిలిచిన 5,306 మెట్రిక్ టన్నుల బియ్యం

ముస్తాబాద్(సిరిసిల్ల): సంక్రాంతి పండుగకు ముందు చౌకబియ్యం సరఫరా నిలిచిపోయింది. పండుగ సమీపిస్తున్నప్పటికీ రేషన్ బియ్యం అందక పేద, మధ్యతరగతి ప్రజలు పండుగ ఫలహారాలు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. జిల్లా పౌరసరఫరాల శాఖలో నెలకొన్న సాంకేతిక లోపంతో రేషన్ లబ్ధిదారులకు బియ్యం దూరమయ్యాయి. నెల మొదటి వారంలోనే పంపిణీ చేయాల్సిన బియ్యం.. రెండో వారం దాటుతున్న అందకపోవడం విచారకరం. ముఖ్యంగా సంక్రాంతికి చేసుకునే పిండివంటలకు అధికశాతం మంది వినియోగించుకునేది చౌకధరల బియ్యమే.

ఈ–పాస్‌లో సాంకేతికలోపం

ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈపాస్ విధానాన్ని తీసుకొచ్చింది. బయోమెట్రిక్ ద్వారా రేషన్ సరుకులు అందించే ఈ విధానం సర్వత్రా ఆమోదయోగ్యంగా మారింది. నాలుగేళ్లుగా ఈపాస్ విధానంతో రేషన్‌బియ్యం లబ్ధిదారులకే చేరుతున్నాయి. జనవరిలో ఈపాస్‌లో నెలకొన్న సాంకేతికలోపం పదిరోజులైన బాగు అయ్యే పరిస్థితులు కనిపించడం లేదని ఆశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలోని 255 గ్రామాల్లో 345 రేషన్ దుకాణాలకు 5,306 మెట్రిక్ టన్నుల బియ్యం చేరాయి. దుకాణాలకు చేరిన బియ్యాన్ని లబ్ధిదారులకు అందించలేని పరిస్థితిలో డీలర్లు ఉన్నారు. పండుగ సమీపిస్తుండడంతో లబ్ధిదారులు దుకాణాలకు నిత్యం వచ్చి వెళ్తున్నారు. అక్కడ తాళాలే దర్శనం ఇవ్వడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. గత వారం రోజులుగా ఈపాస్‌లో నెలకొన్న సాంకేతిక లోపాన్ని సరిచేసేందుకు నిపుణులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా అవి సఫలీకృతం కావడం లేదంటున్నారు. మరో మూడు రోజుల్లో పండుగ ఉండడంతో.. పిండివంటలు ఎలా చేసేదని గందరగోళంలో ప్రజలు ఉన్నారు.



ముస్తాబాద్‌లో తెరుచుకోని రేషన్ దుకాణం

రోజూ తిరుగుతున్నం



బీడీలు పక్కన పెట్టి రేషన్‌షాపుల చుట్టు రోజూ తిరుగుతున్నం. దుకాణాలకు తాళాలు వేసి ఉంటున్నాయి. పండుగ వస్తుందని సకినాల పిండి బియ్యంతోనే పట్టిస్తాం. రేషన్ షాపులు తెరువడం లేదు. రేషన్ బియ్యం తిని బతికేటోళ్లకు ఎట్ల. సార్లు జెరా ఆలోచన చేయాలే.

– భాగ్య, ముస్తాబాద్

పిండివంటలు ఎట్లా..



సంక్రాంతి ఇంకో మూడు రోజులే ఉంది. ఇంట్ల ఇప్పటి వరకు ఏం చేయలేదు. రేషన్ దుకాణంలో బియ్యం వత్తయని ఎదురు చూస్తున్నం. మిషన్ పాడైందని డీలర్ చెప్తుండు. పండగ ముందు గిట్ల ఇబ్బంది పెట్టుడు మంచిదేనా. పండగ పూట పరేషన్ చేయకుండ్రి సార్లు.

– విజయ, ముస్తాబాద్

సాంకేతికలోపం సరిచేస్తున్నాం

ఈపాస్ విధానంలో సాంకేతికలోపం ఏర్పడడంతో రేషన్ సరుకుల పంపిణీ ఆలస్యం అవుతోంది. మా శాఖలో ఐటీ నిపుణులు దానిని సరిచేసేందుకు నిత్యం ప్రయత్నిస్తున్నారు. పండుగ ముందు ఇలా కావడం బాధాకరం. కొద్ది గంటల వ్యవధిలోనే లోపాన్ని సరిచేసి రేషన్ అందిస్తాం.

– జితేందర్‌రెడ్డి, డీఎస్‌వో

క్లుప్తంగా

పని చేసే వారికే గుర్తింపు

- జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు



ధర్మనాయక్‌ను సన్మానిస్తున్న సుమన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వపరంగా నిరుపేదలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించిన ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు ధర్మనాయక్, మీనాక్షి బదిలీ వెళ్తున్న సందర్భంగా వారిని మంగళవారం సన్మానించారు. ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచులు ముక్క శంకర్, అజ్మీరా రాజు, వైద్యసిబ్బంది ఉన్నారు.

కన్జ్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడిగా కరుణాకర్



అక్కెనపెల్లి కరుణాకర్

బోయినపల్లి(చొప్పదండి): తెలంగాణ రాష్ట్ర కన్జ్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్(సీఆర్‌ఓ) జిల్లా అధ్యక్షునిగా మండలంలోని స్తంభంపల్లికి చెందిన అక్కెనపెల్లి కరుణాకర్‌ను నియమించినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామగిరి హరిబాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన అక్కెనపెల్లి కరుణాకర్ మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారుల సమస్యలు పరిష్కారానికి చొరవ తీసుకుంటామని తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



పర్శరాం(ఫైల్)

ఇల్లంతకుంట(మానకొండూరు): ఇల్లంతకుంటలోని బస్టాండ్ వద్ద అతివేగంగా వచ్చి కారు ఢీకొనడంతో మండల కేంద్రానికి చెందిన అంతగిరి పర్శరాములు(55) మృతిచెందాడు. పర్శరాములు బస్టాండ్ వద్ద మంగళవారం నిలబడగా ముస్కాన్‌పేటకు చెందిన ఓరుగంటి సురేశ్ కారులో అతివేతంగా వచ్చి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ పర్శరాములను కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య విజయ, కుమారుడు హరికృష్ణ, కూతుళ్లు ఉన్నారు. సంఘటన స్థలాన్ని ఏఎస్సై మోతి రామ్ పరిశీలించి మృతుడి భార్య విజయ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పులబాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం శ్రీగాథ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ తొండ్ల రవికుమార్(24) అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవికుమార్ కొంత కాలంగా ఫైనాన్స్‌లో ఆటో కొనుగోలు చేశాడు. ఇటీవల పాత ఇంటికి మరమ్మతులు, రెండు గదుల నిర్మాణానికి రూ.6లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు పెరిగిపోతుండడంతో మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం తెల్లవారుజామున వరి నాటుకు కూలీలను తీసుకొస్తానని చెప్పి వెళ్లి పొలంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుని తండ్రి ఎల్లయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

ఆయిల్‌పామ్ అంతంతే..!



వేములవాడ మండలం నుంచి అశ్వారావుపేటకు అవగాహన కోసం వెళ్లిన రైతులు (ఫైల్)



ఆయిల్‌పామ్ పంట

- రైతుల నుంచి స్పందన కరువు
- అవగాహన కల్పిస్తున్నా ముందుకు రాని రైతులు
- మార్కెటింగ్‌పై అయోమయం
- వెంటనే ఫలితాలు రాకపోవడం ప్రధాన కారణం

వేములవాడరూరల్: జిల్లా రైతులను సాంప్రదాయ పంటల సాగు నుంచి ప్రత్యామ్నాయం వైపు మళ్లించేందుకు వ్యవసాయాధికారులు చేస్తున్న ప్రయత్నాలు వందశాతం ఫలితాలు ఇవ్వడం లేదు. ప్రతీ సీజన్‌లో వరి, పత్తి పంటలు వేస్తూ నష్టపోతున్న అన్నదాతలను ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సహించేందుకు జిల్లా అధికారులు అవగాహన సదస్సులు చేపడుతున్నా రైతుల నుంచి స్పందన తక్కువగా ఉంది.

అవగాహన కల్పించినా..

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు జిల్లా ఉద్యానశాఖ అధికారులు రైతులతో నిత్యం సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేటలోని ఆయిల్‌పామ్ తోటల సందర్శనకు జిల్లా రైతులను తీసుకెళ్లారు. అక్కడి రైతులు సాధించిన విజయాలను కళ్లారా చూసొచ్చారు. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కలు, డ్రిప్‌యంత్రాలను సబ్సిడీపై అందజేస్తున్నాయి. పెద్ద సంఖ్యలో రైతులు ముందుకొస్తే ఈ ప్రాంతంలో ఆయిల్‌ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కానీ చాలా మంది రైతులు సమావేశాల్లో వచ్చి పోవడమే తప్ప పంట సాగుకు ముందుకురావడం లేదని తెలిసింది. ఇప్పటి వరకు జిల్లాలోని 13 మండలాల వ్యాప్తంగా 227 మంది రైతులు 797 ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. మరో 150 మంది రైతులు 455 ఎకరాల్లో సాగు చేసుకునేందుకు హార్టికల్చర్ అధికారులకు డీడీలు చెల్లించినట్లు తెలిసింది. జిల్లాలో 1.85 లక్షల ఎకరాల్లో పంటలు సాగు అవుతున్నాయి. దీన్ని బట్టి చూస్తే ఆయిల్‌పామ్ ఎంత తక్కువ విస్తీర్ణంలో సాగు అవుతుందో అర్థం చేసుకోవచ్చు.

నాలుగేళ్లకు మొదటి క్రాప్

ఆయిల్‌పామ్ సాగు చేసుకునే రైతులు మొదటి క్రాప్ కోసం నాలుగేళ్ల వరకు వేచి చూడాల్సి ఉంటుంది. నాలుగేళ్ల నుంచి రైతులు లాభాలు చూస్తుంటారు. ఒక్కసారి సాగుచేస్తే దాదాపు ముప్పై ఏళ్ల వరకు పంట వస్తూనే ఉంటుంది.

సబ్సిడీ ఇలా..

ఆయిల్‌పామ్ సాగుచేసుకునే రైతు ఎకరానికి రూ.వెయ్యి డీడీ చెల్లిస్తే 50 మొక్కలను అందజేస్తారు. ఒక్కో మొక్క ధర రూ.193 అయితే రైతు మాత్రం రూ.20 చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీలకు డ్రిప్ ఇరిగేషన్ వందశాతం సబ్సిడీపై అందజేస్తారు. చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం సబ్సిడీ అందజేస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగుచేసుకున్న రైతులకు ఎకరానికి ఏడాదికి రూ.4,200 ఇన్‌పుట్ సబ్సిడీ నాలుగేళ్లపాటు ప్రభుత్వం అందజేస్తుంది.

9 ఎకరాల్లో సాగుచేసిన



వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్‌లో తొమ్మిదెకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న. ఇప్పటి వరకు ఐదు నెలలు గడిచింది. మొక్కలు, డ్రిప్ ప్రభుత్వం ద్వారా నే అందింది. మొదటిసారి ఈ పంటను సాగుచేసుకున్నాను. నాలుగేళ్ల తర్వాత లాభమో.. నష్టమో తెలుస్తుంది. అంతర్గత పంట సాగుచేసుకుందామంటే కోతుల బెడద ఉన్నది. – భూపతి రాజు, చింతల్‌ఠాణా

నల్లరేగడి నేలలు



మా ప్రాంతంలో ఎక్కువగా నల్లరేగడి నేలలు ఉన్నాయి. ఇక్కడ ఆయిల్‌పామ్ అనుకూలంగా ఉంటుందా,.. లేదా.. అనేది అనుమానం. ప్రధానంగా ఆరు నెలల పంటపైనే ఈ ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు దృష్టి పెడుతున్నారు. ఆయిల్‌పామ్ మార్కెటింగ్ లేకపోవడం ప్రధాన సమస్య.

– కొమ్ముల సుదర్శన్‌రెడ్డి, లింగంపల్లి

రైతులు ముందుకొస్తున్నారు



వేములవాడ ప్రాంతంలో రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేసుకునేందుకు ముందుకొస్తున్నారు. గతేడాది కంటే ఈ సంవత్సరం రైతులు పంట సాగు చేసుకునేందుకు ఇప్పటికే డీడీలు చెల్లించారు. కొందరు రైతులు పంటను కూడా సాగు చేసుకున్నారు. వచ్చే సంవత్సరం వరకు అన్ని గ్రామాల్లో ఈ పంట ఉంటుంది.

– గోవర్ధన్, హార్టికల్చర్ ఆఫీసర్, వేములవాడ

నాట్య మయూరాలు

- ఒకే వేదికపై తల్లీకూతుళ్ల నృత్యప్రదర్శన
- బిజీగా ఉన్నప్పటికీ.. కళపై మమకారంతో ప్రదర్శనలు

సిరిసిల్లకల్చరల్: ఏదైనా కొత్తగా చేయాలన్న తాపత్రయం.. కళపై మమకారంతో ఆ తల్లీకూతుళ్లు నాట్యంలో రాణిస్తున్నారు. ఉపాధ్యాయినిగా పనిచేస్తూనే తీరక సమయంలో నేర్చుకున్న కళను నలుగురి ముందు ప్రదర్శించాలన్న కోరికను నెరవేర్చుకుంటున్నారు. తల్లి ప్రేరణతో కూతురు సైతం నాట్యం నేర్చుకొని.. తల్లీకూతుళ్లు ప్రదర్శనలు ఇస్తున్నారు.

వృత్తి టీచర్.. ప్రవృత్తి నాట్యకళాకారిణి

సిరిసిల్లకు చెందిన ఉపాధ్యాయిని అనూష యశస్విని, ఆమె కూతురు ఆరోతరగతి చదువుతున్న శ్రీమేధ కలిసి నృత్యప్రదర్శనలు ఇస్తున్నారు. అనూష యశస్విని ముస్తాబాద్ మండలం కొండాపూర్ హైస్కూల్‌లో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. చిన్ననాటి నుంచి నాట్యం నేర్చుకోవాలని ఉన్న కోరికను నెరవేర్చుకునేందుకు మూడేళ్ల క్రితం



తల్లీ కూతుళ్లు అనూష యశస్విని, శ్రీమేధ నృత్య ప్రదర్శన

శిక్షణ ప్రారంభించింది. వేములవాడలోని బాలాత్రిపురసుందరి నాట్యాలయంలో కూచిపూడి నృత్యం శిక్షణ పొందారు. మహాశివరాత్రి సందర్భంగా శివార్చనలో ప్రదర్శన ఇచ్చారు. ఇప్పటి వరకు 15 వేదికలపై నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. కొండగట్టులో జరిగిన హనుమాన్ జయంతి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం, హైదరాబాద్ రవీంద్రభారతి వంటి వేదికలపై ఇచ్చిన ప్రదర్శనతో ప్రశంసలు అందుకున్నారు. ఈ నెల 2, 3 తేదీల్లో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఉమెన్స్ ఫెస్ట్‌లో యశస్విని ప్రదర్శన రాష్ట్ర స్థాయిలో తృతీయస్థానం సంపాదించడంతో పాటు నగదు పురస్కారానికి ఎంపికవడం విశేషం.

తల్లికి తగ్గ తనయ

ఆరోతరగతి చదువుతున్న శ్రీమేధ సైతం తల్లికి తగ్గ తనయగా నిరూపించుకుంటుంది. స్వాతంత్ర వజ్రోత్సవం సందర్భంగా ఆజాదీకా అమృత్ మహోత్సవంలో 75 మందితో కలిసి ప్రదర్శన ఇచ్చింది. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. తల్లితో పాటు వేదికను పంచుకుంటోంది.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు

చందుర్తి: విద్యుత్ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని చందుర్తి సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. చందుర్తిలోని రేణుక ఎల్లమ్మ ఆలయం ఆవరణలో గౌడసంఘం, రజకసంఘం సభ్యులు మంగళవారం సన్మానించారు. చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు



మాట్లాడుతున్న సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు

శ్రీనివాస్, మండల కో–ఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్, గౌడ, రజక సంఘం నాయకులు కత్తి తిరుపతి, పులి నారాయణ, సుద్దాల నర్సయ్య, సుద్దాల భూమయ్య, పులి గంగాధర్ పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో జైలుశిక్ష

కరీంనగర్‌క్రైం: బాలికకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకునేందుకు తీసుకెళ్లిన ఆకుల విక్రమ్(31)కు ఏడేళ్ల జైలు, రూ.300 జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి భవానీచంద్ర మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. హుజూరాబాద్ పట్టణశివారు కొత్తపల్లికి చెందిన బాలిక(16) హుజూరాబాద్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన మెకానిక్ పనిచేసే ఆకుల విక్రం బాలికకు మాయమాటలు చెప్పి 2016 జనవరి 25న తీసుకెళ్లాడు. బాలికకోసం రెండురోజులు వెతికిన ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విక్రమ్ కూడా రెండు రోజులుగా కనిపించకపోవడంతో అనుమానం వచ్చి గాలింపు చేపట్టారు. ఖమ్మం జిల్లాలోని ఓ గ్రామంలో ఇద్దరిని పట్టుకున్నారు. బాలికను ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. హుజూరాబాద్ పోలీసులు విక్రమ్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ రమణమూర్తి దర్యాప్తు జరిపారు. సాక్షులను ఏపీపీ కే.సంజీవరెడ్డి విచారించారు. సాక్షాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడైన విక్రమ్‌కు ఏడేళ్ల జైలు, రూ.300 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఉరేసుకుని ఆత్మహత్య



భూమయ్య మృతదేహం

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని వడ్కాపూర్‌లో మంగళవారం ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. గ్రామానికి చెందిన కూనిరాజుల భూమయ్య(50) తన కూతురు వివాహం కోసం రూ.10లక్షల వరకు అప్పు చేశాడు. తనతో పాటు భార్య వీరమ్మ కూలీ పనులు చేసినా.. అప్పు తీరకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరమ్మ ఫిర్యాదుమేరకు ఎస్సై వెంకటకృష్ణ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



రక్తపు మడుగులో పోచయ్య

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం నామాపూర్ శివారులో మంగళవారం రాత్రి నిలిచి ఉన్న కేజీవీల్స్ ట్రాక్టర్‌ను ఢీకొట్టి ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు. సిద్దిపేట జిల్లా చిన్నకొడూరు మండలం సండ్లాపూర్‌కు చెందిన కుంచం పోచయ్య(48) బైక్‌పై మంగళవారం రాత్రి ఆవునూర్ వైపునకు వెళ్తున్నాడు. నామాపూర్ శివారులో రాంరెడ్డిపల్లె వై–జంక్షన్ వద్ద రోడ్డు పక్కన నిలిచి ఉన్న కేజీవీల్స్ ట్రాక్టర్‌ను పోచయ్య వేగంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో పోచయ్య తలకు తీవ్ర గాయాలుకాగా అపస్మారకస్థితిలో పడిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు క్షతగాత్రుడిని సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.

'సిరిసిల్లలో బీజేపీ జెండా ఎగురవేస్తాం'

సిరిసిల్లటౌన్: రానున్న ఎన్నికల్లో సిరిసిల్లలో మంత్రి కేటీఆర్‌ని గద్దె దించి బీజేపీ జెండాను ఎగురవేస్తామని కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు పేర్కొన్నారు. సిరిసిల్లలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్ల పర్యటన సందర్భంగా మంత్రి కేటీఆర్ బీజేపీపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గతంలో తొమ్మిదేళ్లుగా కరీంనగర్ ఎంపీగా పనిచేసిన సీఎం కేసీఆర్ కంటే ఎంపీ బండి సంజయ్ ఎంతో అభివృద్ధి చేశారన్నా రు. ఇటీవల సిరిసిల్లలో జరిగిన సెస్ ఎన్నికల్లో బీజేపీకి ఓటుశాతం పెరిగడంతో మంత్రి కేటీఆర్‌కు భయం పుట్టుకుందని ఎద్దేవా చేశారు.

మాజీ సర్పంచ్ నర్సాగౌడ్‌కు మంత్రి పరామర్శ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలోని బండలింగంపల్లి మాజీ సర్పంచ్ నర్సాగౌడ్ గుండె సంబంధిత వ్యాధితో సోమవారం రాత్రి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్ ఈ విషయం తెలుసుకొని.. కరీంనగర్ వెళ్లి నర్సాగౌడ్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. రాష్ట్ర ప్రణాళికసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటి లక్ష్మణరావు,



నర్సాగౌడ్‌ను పరామర్శిస్తున్న మంత్రి కేటీఆర్

సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అందె సుభాశ్ ఉన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలో ప్రారంభంకానున్న కాంగ్రెస్ హాత్ సే హాత్ జోడో అభియాన్ పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. ఇల్లంతకుంటలో మంగళవారం కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రభుత్వాలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు పసుల వెంకటి, జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టి ఆనందరెడ్డి, రవీందర్‌రెడ్డి, రజనీకాంత్, లింగం పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సిగ్గుచేటు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటన నేపథ్యంలో ఇతర పార్టీల నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వేకువజామున పోలీసులు ప్రతిపక్ష పార్టీల నాయకులను అరెస్టు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటను ఉన్నప్పుడల్లా ఇలా అరెస్టు చేసి ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్నారన్నారు. సమస్యలపై విద్యార్థి సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో మల్లారపు అరుణ్‌కుమార్, నాయకులు ఉన్నారు.



పోలీసుల అదుపులో నాయకులు

పార్టీని బలోపేతం చేయాలి

- బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను
- జిల్లా అధ్యక్షునిగా స్వామిగౌడ్ ఎన్నిక

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లా వ్యాప్తంగా బహుజన సమాజ్ పార్టీని బలోపేతం చేయాలని, కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను కోరారు. రాజన్నసిరిసిల్ల జిల్లా బీఎస్పీ అధ్యక్షుడిగా ఎల్లారెడ్డిపేటకు చెందిన వరదెల్లి స్వామిగౌడ్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భాను మాట్లాడుతూ స్వామిగౌడ్ సామన్య కార్యకర్తగా చేరి పార్టీ బలోపేతానికి ఎంతో కృషిచేశారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో స్వామిగౌడ్ ఆధ్వర్యంలో జిల్లాలో బీఎస్పీ జెండా ఎగురవేస్తామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు స్వామిగౌడ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల నుంచి బరిలో ఉండే పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రునాయక్, కోశాధికారి అబ్దుల్ నబీ, జిల్లా కార్యదర్శులు మహేందర్, మధుకర్, నాయకులు అంజయ్య, రాజబాబు, కొమురయ్య, నీలకంఠం, అన్నల్‌దాస్ భాను పాల్గొన్నారు.



స్వామిగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

సబ్‌స్టేషన్‌లో మందుబాబుల వీరంగం

- బావుసాయిపేట సబ్‌స్టేషన్‌లో మద్యం సిట్టింగ్‌లు

కోనరావుపేట(వేములవాడ): విద్యుత్ సేవలు అందించాల్సిన సబ్‌స్టేషన్ సిబ్బంది మద్యం మత్తులో ఉంటున్నారు. ఈక్రమంలో ఓ గ్రామస్తున్ని పిలిచి చితకబాదారు. ఈ విషయ ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. కోనరావుపేట మండలం బావుసాయిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొంతకాలంగా మద్యం సిట్టింగ్‌లు నడుస్తున్నాయి. ఆపరేటర్‌గా పనిచేస్తున్న నందకుమార్ డ్యూటీలో ఉన్న రోజులు మందుబాబులతో నిండిపోతుంది. ప్రతి రోజూ గ్రామస్తులు చేరుకుని సబ్‌స్టేషన్‌లోనే మద్యం సేవించడం పరిపాటిగా మారింది. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం సబ్‌స్టేషన్ ఆవరణలో ఆపరేటర్ నందకుమార్‌తో కలిసి మద్యం సేవిస్తున్న కొందరు గ్రామస్తులు ఇదే గ్రామానికి చెందిన లాల సంజీవ్‌ను మందుపార్టీకని పిలిచి చితకబాదారు. గ్రామానికి చెందిన వెంకటేశంతోపాటు మరికొందరు తనపై దాడికి పాల్పడినట్లు బాధితు డు సంజీవ్ కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా గత కొన్నిరోజులుగా సబ్‌స్టేషన్‌లో మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయని, ఆపరేటర్ మద్యం మత్తులో రైతులతో దురుసుగా మాట్లాడుతున్నాడని, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎన్‌పీడీసీఎల్ ఏడీ ప్రదీప్‌ను వివరణ కోరగా.. సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

కేటీఆర్.. రాజీనామాకు సిద్ధంగా ఉండండి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి

సిరిసిల్లటౌన్: మంత్రి కేటీఆర్ బీజేపీపై చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి ఘాటుగా స్పందించారు. ఈమేరకు మంగళవారం రాత్రి ఆమె ప్రకటన విడుదల చేశారు. కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులు తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్లిన నిధుల విషయంపై గతంలోనే కేటీఆర్ సవాల్‌ను స్వీకరించి చర్చకు రావాలని పిలిచామని ఆయనే రాలేదని పేర్కొన్నారు. సిరిసిల్లలో బీజేపీని పదే పదే తలుచుకుంటున్న కేటీఆర్ మాటలను చూస్తే తమ పార్టీ కార్యకర్తలు కేటీఆర్‌కు నిద్రలేకుండా చేస్తున్నారనే దానికి నిదర్శనమని పేర్కొన్నారు. సెస్ ఎన్నికల్లో బీజేపీకి ట్రైలర్ చూపించామంటున్న కేటీఆర్.. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులకు బీజేపీ సినిమా చూపించిందని ఎద్దేవా చేశారు. నిధులపై చర్చకు ఇప్పటికైనా సిరిసిల్లలో ఏ సెంటర్‌కి వస్తారో రండి మేము సిద్ధమన్నారు. సిరిసిల్లలో కేటీఆర్ సీటు పోకుండా చూసుకోవాలని చురకలు అంటించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని గురుకులంలో పురుగుల అన్నం పెడుతున్నారని విద్యార్థులు రోడ్డెక్కడం, గొల్లపల్లిలో కలుషిత నీరు తాగిన విద్యార్థులు ఆసుపత్రి పాలవడం ఎమ్మెల్యేగా కేటీఆర్ సిగ్గుపడాలని విమర్శించారు.

రజకులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న రమేశ్

- రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రజకులు కులవృత్తితోపాటు మిగతా రంగాల్లో రాణించాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్ కోరారు. ఎల్లారెడ్డిపేటలోని రజక సంఘంలో మండల అధ్యక్షుడిగా కంచర్ల నర్సయ్యను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 14 మందితో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ రజకులు రాజకీయంగా, వ్యాపార రంగంలో రాణించాలన్నారు. మండలవ్యాప్తంగా 450 రజక కుటుంబాలు ఉన్నాయని, సంఘంలో ఏమైనా సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. పెద్దురూ కిష్టయ్య, వడ్నాల బాలయ్య, దొమ్మాటి నర్సయ్య, రాజు, బాలమల్లు, పోచయ్య పాల్గొన్నారు.